సాక్షి
మెదక్
సోమవారం, 8, మే, 2023



మలిసంధ్యలో మనోవేదన

కడుపున పుట్టిన పిల్లలు పట్టించుకోకపోవడంతో వృద్ధాప్యంలో తల్లిదండ్రుల బతుకు భారంగా గడుస్తోంది. ఆప్యాయతకు దూరమై తనువు చాలిస్తున్నారు. 8లో



దూసుకొచ్చిన మృత్యువు

పండ్ల వ్యాపారులపైకి కారు దూసుకురావడంతో ఒకరు మృతిచెందగా, మరో నలుగురు గాయపడ్డారు. ఈ ఘటన రామాయంపేటలో చోటుచేసుకుంది. 8లో



కాంటా.. తంటా

ఆరుగాలం కష్టపడితే కానీ పంట చేతికొచ్చే పరిస్థితి లేదు. దానిని అమ్ముకుందామంటే రైస్ మిల్లుల యాజమాన్యాలు పెడుతున్న షరతులతో ఆందోళన చెందుతున్నారు. 9లో

న్యూస్‌రీల్

కొనసాగుతున్న వీఓఏల సమ్మె



శిబిరంలో నినాదాలు చేస్తున్న వీఓఏలు

మెదక్ కలెక్టరేట్: డిమాండ్ల సాధనకోసం వీఓఏలు మెదక్ కలెక్టరేట్ ముందు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం 21వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా వీఓఏలు తమ న్యాయమైన డిమాండ్లు వెంటనే పరిష్కరించాలని కోరుతూ ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సాయాగౌడ్, ప్రధాన కార్యదర్శి స్వరూపరాణి, కోశాధికారి కవిత, గంగాపురం వెంకన్న, నర్సింలు, అశోక్ యాదవ్,దశరథ్, అశోక్‌తో పాటు జిల్లాలోని ఆయా మండలాలకు చెందిన వీఓఏలు పాల్గొన్నారు.

సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



మెదక్‌జోన్: ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మెదక్ సీఎస్ఐ చర్చిలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. జిల్లాతోపాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చర్చి గురువులు దైవ సందేశమిచ్చి భక్తులను ఆశీర్వదించారు.

వచ్చే ఎన్నికల నాటికి బీఆర్ఎస్ ఖాళీ



సాల్మన్ రాజును పార్టీలోకి ఆహ్వానిస్తున్న డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి

రామాయంపేట(మెదక్): వచ్చే ఎన్నికలనాటికి బీఆర్ఎస్ ఖాళీ అవుతుందని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ఝాన్సిలింగాపూర్ గ్రామానికి చెందిన నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ మోసపూరిత హామీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారిని పట్టించుకోవడంలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనతో విసిగిపోయిన ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని, చాలామంది పార్టీలో చేరుతున్నారని తెలిపారు. ఝాన్సిలింగాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు సాల్మన్ ఆధ్వర్యంలో పలువురు వార్డు సభ్యులు, యువకులు కాంగ్రెస్‌లో చేరగా, వారి మెడలో కాంగ్రెస్ కండువావేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు శ్యాంరెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చింతల యాదగిరి, కౌన్సిలర్ అనిల్‌కుమార్, నాయకులు సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రసవం మరింత సులభం

- రక్తహీనతఉన్న గర్భిణులకు బలవర్ధక ఆహారం
- ఒక్కొక్కరికి రెండు చొప్పున కిట్‌లు
- జిల్లాకు 750 న్యూట్రీషన్ కిట్‌ల కేటాయింపు



పెద్దశంకరంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యం కోసం వచ్చిన గర్భిణులు

మెదక్ జోన్: బిడ్డకు జన్మనివ్వాలంటే ఆ తల్లి మరోజన్మ ఎత్తటమేనని వైద్యులు చెబుతుంటారు. ప్రసవించే మహిళా ఆరోగ్యంగా ఉంటేనే సుఖప్రసవంతో పాటు పుట్టబోయే బిడ్డకూడ ఆరోగ్యంగా ఉంటుంది. కాగా రక్తహీనతగల గర్భిణులు మాత్రం ఇబ్బందులు ఎదురుకోక తప్పదు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం రక్తహీనత గల గర్భిణుల కోసం బలవర్ధకమైన ఆహారాన్ని 'న్యూట్రీషన్' కిట్లను అందిస్తోంది.

- జిల్లా వ్యాప్తంగా 6,001 మంది గర్భిణులు ఉండగా వారిలో చాలామంది గ్రామీణ ప్రాంతాలు, గిరిజన తండాలలోని గర్భందాల్చిన మహిళల్లో అధికంగా రక్తహీనత(ఎనీమియా)తో బాధపడుతున్నారని వైద్యులు చెబుతున్నారు.
- ప్రసవ సమయంలో కొందరు విషమ పరిస్థితులు ఎదురుకుంటున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం న్యూట్రీషన్ కిట్లు పంపిణీ చేస్తోంది.
- ఇందులో భాగంగా మెదక్ జిల్లాకు 750 న్యూట్రీషన్ కిట్లు వచ్చాయి.
- గర్భిణుల్లో రక్తహీనతతో బాధపడే వారికి రెండు కిట్లును అందించనున్నారు. 4వ నెలలో ఒకటి, 5వ నెలలో ఒక్కటి చొప్పున ఇవ్వనున్నారు.
- సుఖప్రసవం అయినప్పుడే తల్లీ బిడ్డా ఆరోగ్యంగా ఉంటారని ప్రభుత్వం భావించి వైద్యారోగ్య రంగానికి పెద్దపీట వేస్తోంది.
- సర్కార్ దావాఖానాలోనే ప్రసవాలు జరిగేలా కార్యచరణ రూపొందించింది. అందుకుగాను అధునాతన వసతులతో ఆస్పత్రులను నిర్మించి సౌకర్యాలు కల్పిస్తోంది.
- జిల్లా కేంద్రంలో మాతాశిశు ఆస్పత్రి(ఎంసీహెచ్) గతేడాది అందుబాటులోకి రాగా ఇక్కడ ప్రతీనెల 350 నుంచి 400 ప్రసవాలు జరుగుతున్నాయి. దీంతో పాటు నర్సాపూర్, తూప్రాన్, రామాయంపేట ఆస్పత్రుల్లోనూ ప్రసవాలు జరుగుతున్నారు.
- రక్తహీనతతోపాటు ఇతర సమస్యలతో బాధపడుతున్నా వారికి మెదక్ ఎంసీహెచ్ వైద్యుల పర్యవేక్షణలో చికిత్సలు అందిస్తున్నారు.
- గర్భిణీగా నిర్ధారణ అయ్యాక క్రమంగా ఆస్పత్రికి వచ్చేవారికి వివిధ పరీక్షలు చేస్తున్నారు.
- ఇలా తొమ్మిది నెలలపాటు బలవర్ధకమైన ఆహారంతోపాటు రోజుకు ఒక గుడ్డు, పాలు ఇస్తారు. కాగా కొందరు గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లని వారికి సదరు అంగన్‌వాడీ టీచర్లు గుడ్లు, పప్పులు, పాలు ఇంటికే పంపుతారు.
- ఇలా ఇచ్చిన పౌష్టికాహారం గర్భిణికి అందకుంటే ఆమె రక్తహీనత సమస్య ఎదుర్కోక తప్పదు. ఫలితంగా కాన్పు సమయంలో ఇబ్బందులు పడే అవకాశం ఉంది.

న్యూట్రీషన్ కిట్‌తో ఆరోగ్యం

- ప్రభుత్వాసు పత్రుల్లోనే ప్రసవాలు జరగాలని, అప్పుడే తల్లీ బిడ్డా ఆరోగ్యంగా ఉంటారని గుర్తించింది. కాగా గర్భం నిర్ధారణ అయ్యాక మంచి పౌష్టిక ఆహారం తీసుకుంటేనే సుఖప్రసవం సాధ్యమవుతుందని, లేకుంటే డెలవరీ సమయంలో ఇబ్బందులు కలుగుతాయని భావించింది.
- రూ.2 వేల విలువగల న్యూట్రీషన్ కిట్టును గర్భిణులకు అందించనున్నారు. ఇందులో పోషకాహార పదార్థాలతో కూడిన పొడి ఉంటుంది. ఖర్జూర, ఐరన్ సిరప్, నెయ్యి, పల్లిపట్టీలు ఉంటాయి. గర్భం నిర్ధారణ అయ్యాక వీటిని తీసుకుంటే రక్తహీనత ఉండదని, దీంతో సుఖప్రసవాలు చేయటం చాలా సులభతరంగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.

అంగన్‌వాడి కేంద్రాల ద్వారా..

కేంద్ర ప్రభుత్వం మహిళల ఆరోగ్యంగా ఉండేందుకు మూడు నెలల గర్భందాల్చిన నాటి నుంచి పుట్టిన శిశువుకి ఆరు మాసాలు వచ్చేవరకు పాలు, గుడ్లు ఇవ్వటంతో పాటు అంగన్‌వాడి కేంద్రంలో ఆకుకూరలు పప్పులతో రోజు ఒకపూట భోజనం పెడుతారు.

తొమ్మిది నెలలు నిండకుండానే..



రక్తహీనతగల గర్భిణులు అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. వారికి బీపీ రావటంతో పాటు కడుపులో పిండం పెరగదు, తొమ్మిది నెలలు నిండకుండానే ప్రసవిస్తారు. డెలివరీకి ముందు, తర్వాత సైతం రక్తస్రావం అయ్యే అవకాశాలు ఉంటాయి

– డాక్టర్ శివదయాల్, గైనిక్

750 కిట్లు వచ్చాయి



జిల్లాలో 6,001 మంది గర్భిణులు ఉన్నారు. 750 న్యూట్రిషన్ కిట్లు వచ్చాయి. మెదక్ జిల్లాకు 12 వేల న్యూట్రిషన్ కిట్లు రావాల్సి ఉంది. మిగతావి త్వరలో వస్తాయి.

– జిల్లా వైద్యాధికారి చందూనాయక్

కిటకిటలాడిన ఏడుపాయల



దుర్గమ్మ దర్శనానికి వచ్చిన భక్తులు

పాపన్నపేట (మెదక్): అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులతో ఏడుపాయల ఆదివారం కిటకిటలాడింది. మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వేలాది భక్తులు తెల్లారుజామునే వచ్చి, మంజీరా నదిలో స్నానాలు చేశారు. దుర్గమ్మను దర్శనం చేసుకున్నారు. మరికొంత మంది భక్తులు బోనాలు సమర్పించారు, ఒడిబియ్యం పోసి దుర్గమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. పాలకవర్గ చైర్మన్ బాలాగౌడ్, ఈఓ సార శ్రీనివాస్ దర్శన ఏర్పాట్లు చేశారు.

15 నుంచి సీఎం కప్ పోటీలు

- మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో క్రీడలు
- జిల్లా యువజన క్రీడల అధికారి నాగరాజు

మెదక్ కలెక్టరేట్: ఈనెల 15వ తేదీ నుంచి సీఎం కప్ పేరుతో మండలం, జిల్లా, రాష్ట్రస్థాయి క్రీడలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా యువజన క్రీడల అధికారి నాగరాజు ఆదివారం తెలిపారు. 15 నుంచి 17వరకు మండల స్థాయిలో అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు జరుగుతాయన్నారు. విజేతలకు మెరిట్ సర్టిఫికెట్ ఇస్తారని తెలిపారు. 15 నుంచి 36 ఏళ్ల వయస్సు గల స్త్రీ, పురుషులు పాల్గొనవచ్చన్నారు. మండలస్థాయి క్రీడలకు రూ.15 వేలు ప్రభుత్వం కేటాయించినట్లు తెలిపారు. విజేతల వివరాలను ఈనెల 18వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా జిల్లా యుజన, క్రీడల శాఖ కార్యాలయంలో సమర్పించాలన్నారు. మండల స్థాయి కమిటీ చైర్మన్‌గా ఎంపీపీ, సభ్యులుగా జెడ్పీటీసీ, కన్వీనర్‌గా ఎంపీడీఓ, తహసీల్దార్, ఎంఈఓ, గెజిటెడ్ హెడ్మాస్టర్, ఎస్ఐ, మున్సిపల్ కమిషనర్, పీడీ, పీఈటీ వ్యవహరిస్తారు. మండల స్థాయిలో గెలుపొందిన వారికి జిల్లాస్థాయిలో 11 విభాగాల క్రీడల్లో జరుగుతాయని తెలిపారు. ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు మెదక్ పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియం, పీఎస్ఆర్ ఇండోర్ స్టేడియం, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో జరుగుతాయన్నారు. అథ్లెట్స్, స్విమ్మింగ్ , హ్యాండ్‌బాల్, ఖోఖో, వాలీబాల్, కుస్తీ, బాక్సింగ్, కబడ్డీ, బాస్కెట్ బాల్, ఫుట్‌బాల్ తదితర పోటీలు జరుగనున్నాయి. ఈ పోటీలకు జిల్లా కమిటీ చైర్మన్‌గా కలెక్టర్, వైస్‌చైర్మన్‌గా ఎస్పీ, కోవైస్ చైర్మన్‌గా అదనపు కలెక్టర్‌లతో పాటు పలువురు జిల్లా అధికారులు ఉంటారు. గెలుపొందిన వారికి మెరిట్ సర్టిఫికెట్ సర్టిఫికెట్ అందజేస్తారు. ఈనెల 29 నుంచి 31 వరకు హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు జరుగున్నాయని తెలిపారు. ఈ రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.లక్ష, రెండో బహుమతి రూ.75 వేలు, మూడో బహుమతి కింద రూ.50వేలు, వ్యక్తిగత క్రీడలలో మొదటి విజేతకు రూ.20 వేలు, రెండో విజేతకు రూ.15 వేలు, మూడో బహుమతి రూ.10 వేల నగదు ఇవ్వనున్నట్లు తెలిపారు. పూర్తి సమాచారానికి సంబంధిత మండల కేంద్రంలో సంప్రదించాలన్నారు.

లేబర్ కోడ్ రద్దుకు ఉద్యమించాలి



మెదక్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్

మెదక్ కలెక్టరేట్: మేడే స్ఫూర్తితో లేబర్ కోడ్ రద్దుకు ఉద్యమించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో కేవల్ కిషన్ భవనంలో మేడే ముగింపు సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక కార్మికులకు నష్టం చేసే విధానాలు తెచ్చిందన్నారు. మేడే అంటే అపరిమిత పనిగంటలు, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా చేసిన గొప్ప విప్లవ పోరాటమని గుర్తుచేశారు. సాధించిన కార్మిక చట్టాలను పెట్టుబడిదారులకు అనుకూలంగా మలుస్తున్నారని ఆరోపించారు. అంతకు ముందు మెదక్ పాత బస్టాండ్ నుంచి హెడ్ పోస్టాఫీస్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బస్వరాజ్, జిల్లా కోశాధికారి నర్సమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం మల్లేశం, నాయకులు ఏసు, బద్రి, అంజమ్మ, ప్రమీల, ప్రశాంత్ పాల్గొన్నారు.

గౌడ కులస్తులను మోసం చేసే కుట్రలు



మాట్లాడుతున్న బీజేపీ గౌడ నాయకులు

బీజేపీ నియోజకవర్గ కన్వీనర్, గౌడ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లేశ్‌గౌడ్

నర్సాపూర్: రాష్ట్రంలోని గౌడ కులస్తులను సీఎం కేసీఆర్ మోసం చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్, గౌడ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లేశ్‌గౌడ్ ఆరోపించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తొమ్మిది ఏళ్లలో ఏనాడూ గౌడ కులస్తులను పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం ఎన్నికలు సమీపించడంతో తమ కులస్తులపై కేసీఆర్ ప్రేమ చూపిస్తున్నారని విమర్శించారు. గీత బీమా పథకాన్ని ప్రకటించిన కొద్దిసేపటికి షరతులు మార్చారన్నారు. గౌడ కార్పొరేషన్ ప్రకటించినా చిల్లి గవ్వ ఇవ్వలేదన్నారు. నీరా పాలసి తెచ్చినా ప్రభుత్వం చేతిలోనే అంతా ఉండటంతో గౌడ కులస్తులకు ఒరిగేదేమిలేదని, గీత కులవృత్తిని దెబ్బ తీస్తుందన్నారు. రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌గౌడ్ నీరా పాలసిని తెచ్చారని, నీరా పాలసి ప్రభుత్వం వద్ద ఉండడంతో గీత కార్మికులకు నష్టం జరుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నీరా పాలసీని గీత కార్మికులకు అప్పగించె విధంగా నిబంధనలు మార్పు చేయాలని డిమాండ్ చేశారు. వైన్ షాపుల కేటాయింపులో 50 శాతం గౌడ కులస్థులకు కేటాయించాలన్నారు. గీత వృత్తి దారులకు వాహనాలు ఇస్తామని, వాటికోసం కార్మికుల నుంచి కొంత డబ్బు వసూలు చేశారని, ఏళ్లు గడుస్తున్నా ఇంత వాహనాలు ఇవ్వలేదన్నారు. బీజేపీ ఓబీసీ జిల్లా అధ్యక్షుడు రమేశ్‌గౌడ్ మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన తమ కులస్తులకు, బీసీలకు మంత్రి పదవులలో ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో బీజేపీ నాయకులు రవిగౌడ్, ఆంజనేయులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిబిరం

మెదక్ మున్సిపాలిటీ: మెదక్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో సమ్మర్ శిబిరం ముగింపు కార్యక్రమం శనివారం రాత్రి వరకు జరిగింది. సొసైటీ జెఎస్ అకాడమీ శారద, డీఎస్‌డీవో విజయలక్ష్మీ డీసీఓ వరలక్ష్మీ తెలిపారు. 15 రోజుల శిక్షణలో వేదగణితం, వెస్ట్రన్ డ్యాన్స్, సంగీతం, జీవన నైపుణ్యాలు నేర్చుకున్న విద్యార్థులు వాటిని ప్రదర్శించి తమ ప్రతిభ చాటారు. శిబిరంలో పాల్గొన్న వారికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో నాలెడ్జ్ పార్ట్నర్స్, పాఠశాల, కళాశాల సిబ్బంది, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

వాగ్దానాల అమలులో మోదీ విఫలం

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నరసింహ



కరపత్రాలను పంచుతున్న నాయకులు

నర్సాపూర్: ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయడంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విఫలమయ్యారని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నరసింహ ఆరోపించారు. సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు రాష్ట్రంలోని 119 నియోజకవర్గాలలో ఇంటింటికి సీపీఐ కార్యక్రమంలో భాగంగా ఆదివారం నర్సాపూర్‌లో కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 14 నుంచి రాష్ట్రంలో ఇంటింటికి సీపీఐ కార్యక్రమం నెల రోజులు చేపట్టాలని నిర్ణయించామన్నారు. ఎన్నికల్లో లబ్ధిపొందాలని బీజేపీ కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. దేశంలో అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. బీజేపీ హటావో.. దేశ్ కో బచావో నినాదంతో ఇంటింటికి సీపీఐ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి టీఎం కాలేక్, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

సందడిగా 'సాక్షి' సమ్మర్ క్యాంపు

- శిబిరంలో మెళకువలు నేర్పుతున్న శిక్షకులు
- ఆసక్తిగా నేర్చుకుంటున్న విద్యార్థులు
- మరిన్ని శిబిరాలు ఏర్పాటు చేయాలని వినతి



డ్రాయింగ్ వేస్తున్న విద్యార్థులు

మెదక్ కలెక్టరేట్: సాక్షి మీడియా గ్రూప్, సిద్దార్థ్ విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో మెదక్ పట్టణంలోని సిద్దార్థ్ విస్డమ్ స్కూల్‌లో ప్రారంభించిన వేసవి సమ్మర్ క్యాంపు ఆదివారం రెండోరోజు కొనసాగింది. ఈ సందర్భంగా విద్యార్థులతో సందడిగా కొనసాగింది. 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు. చెస్‌కోచ్ హన్మంత్, డ్రాయింగ్ టీచర్ శ్రీనివాస్ విద్యార్థులకు మెలకువలు నేర్పారు. ఈ సందర్భంగా శిక్షకులు మాట్లాడుతూ ఏవైన సందేహాలుంటే అడిగి వెంటనే నివృత్తి చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో సిద్దార్థ్ విస్డమ్ పాఠశాల ఇన్‌చార్జి ప్రభాకర్, కళాశాల ప్రిన్సిపాల్ మచ్చేంద్రనాథ్, పీఈటీ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు మల్లారెడ్డి, నవీన్, సుదర్శనమూర్తి, 'సాక్షి' గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

15 ఏళ్లుగా శిక్షణ ఇస్తున్నా



గత 15 ఏళ్లుగా చెస్, క్యారంలో శిక్షణ ఇస్తున్నా. ఎక్కువగా మెదక్‌లోని గుల్షన్‌క్లబ్‌లో శిక్షణ ఇస్తుంటాను. నా వద్ద శిక్షణ పొందిన విద్యార్థులు జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. 'సాక్షి' ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపు ఏర్పాటు చేయడం అభినందనీయం. ఈ క్యాంపులో నన్ను భాగస్వామి చేయడం చాలా సంతోషంగా ఉంది. విద్యార్థులకు చెస్‌లో అనేక మెలకువలు నేర్పిస్తున్నాను. – హన్మంతు, చెస్ కోచ్

చాలా నేర్చుకున్నా



నాకు చెస్ ఆడటం ఇష్టం. చెస్ ఆడటం కొంతమేర వస్తుంది. గేమ్‌లో ట్రిక్స్ నేర్చుకోవాలని ఉండేది. 'సాక్షి' సమ్మర్ క్యాంపుతో నైపుణ్యాలు మెరుగు పర్చుకోవడానికి ఎంతో దోహద పడింది. రెండు రోజులు క్యాంపులో చెస్ గేమ్‌లో చాలా మెలకువలు నేర్చుకున్నాను.

– శ్రీనిక, 7వ తరగతి

మరిన్ని శిబిరాలు ఏర్పాటు చేయాలి



నాకు చిత్రలేఖనం (డ్రాయింగ్) అంటే ఎంతో ఇష్టం.అద్భుతమైన డ్రాయింగ్ వేయాలని ఉంది. 'సాక్షి' ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపు ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉంది. రెండు రోజులుగా క్యాంపులో పాల్గొన్నాను. కోచ్ ఇచ్చిన సూచనలతో నా నైపుణ్యాలను మెరుగు పర్చుకుంటాను. సాక్షి మరిన్ని శిబిరాలు ఏర్పాటు చేసి పలు క్రీడల్లో శిక్షణ ఇప్పించాలి.

– భావన, 10వ తరగతి

డ్రాయింగ్ వేయడం నచ్చింది



డ్రాయింగ్ వేయడంపై కోచ్‌సార్ మంచి నైపుణ్యాలు నేర్పించారు. కొన్ని పద్ధతులతో డ్రాయింగ్ వేస్తే చిత్రాలు అద్భుతంగా వస్తాయని తెలిపారు. డ్రాయింగ్ ఎలా మొదలుపెట్టాలి, ఎలా పూర్తి చేయాలి వంటి వాటిని వివరించారు.

– శ్రీనిజ, 10వ తరగతి

సంతోషంగా ఉంది



డ్రాయింగ్ వేయడం బాగా నేర్పిస్తు న్నారు. చిన్న చిన్న బొమ్మలు వేశాను. వాటిని మరింత బాగా ఎలా వేయాలో టీచర్ నేర్పించారు. నేను చాలా బొమ్మలు వేస్తా.

– నక్షత్ర, 6వ తరగతి

సరదా ఉంది



మా తోటి వారితో కలిసి చెస్ నేర్చుకోవడం సరదా ఉంది. కోచ్ చెస్‌లో తప్పులు చేయకుండా ఎలా ఆడాలో బాగా నేర్పించారు. దీంతో బాగా ఆడాను. మా ఫ్రెండ్స్ కూడా ఆడారు.

– సద్విన్ శ్రీహర్ష, 3వ తరగతి

బాగా ఆడాను



కోచ్ సారు చెస్ గురించి చెప్పారు. దీంతో చెస్ బాగాను ఆడాను. హ్యాపీగా ఉంది. మరిన్ని ట్రిక్స్ నేర్చుకొని మంచి ప్లేయర్ అవుతా.

– కుశాల్, 7వ తరగతి

బొమ్మలు వేయడం సరదా



నాకు బొమ్మలు వేయడం సరదా. బొమ్మలు బాగా వేయడం నేర్చుకుందామని వచ్చాను. సార్ బాగా చెప్పారు.

– విక్రమాదిత్య, 6వ తరగతి

క్లుప్తంగా

యువకుడి హత్య కేసులో నిందితుల అరెస్ట్

జహీరాబాద్‌: ఇనుపచువ్వలు దొంగిలించాడనే అనుమానంతో ఇటీవల యువకుడిని హత్య చేసిన నిందితులను ఆదివారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్టు రూరల్‌ పోలీసులు తెలిపారు. వివరాలలోకి వెళితే.. జహీరాబాద్‌ పట్టణంలోని బాగారెడ్డిపల్లికి చెందిన మహేష్‌ పాత ఇనుప సామాను అమ్ముకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 5వ తేదీన రంజోల్‌ గ్రామంలోని ఓ వెంచర్‌లో ఇంటి ఇనుప చువ్వలు దొంగిలించాడనే నెపంతో ఎల్లారెడ్డితో పాటు మరో ఎనిమిది మంది కలిసి మహేశ్‌ను స్తంభానికి కట్టేసి తీవ్రంగా కొట్టడంతో అక్కడికక్కడే మరణించాడు. మృతుడి భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు.

కూలి డబ్బు అడిగితే దాడి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కూలి డబ్బు అడిగేందుకు వెళ్లిన కూలీలపై దాడి చేసిన సంఘటన శనివారం రాత్రి బండలగూడలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ..బండలగూడలో నివాసం ఉండే రషీద్‌ నేతాజీ నగర్‌లో నివాసం ఉండే గోపాల్‌ ఇంట్లో కూలిపని చేశాడు. అందుకు సంబంధించిన డబ్బు కోసం రషీద్‌ తన మిత్రుడు రాజును తీసుకొని శనివారం రాత్రి గోపాల్‌ ఇంటికి వెళ్లాడు. గోపాల్‌ ఇంట్లో లేకపోవడంతో బయటే నిలబడ్డారు. అదే సమయంలో ఇంటికి వచ్చిన గోపాల్‌ మీకు ఇక్కడ ఏమి పని అంటూ కుటుంబ సభ్యులతో కలిసి రషీద్‌, రాజుపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. దీంతో రషీద్‌, రాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దాడిచేసిన వ్యక్తిపై కేసు నమోదు

కౌడిపల్లి(నర్సాపూర్‌): కౌడిపల్లిలో ఒకరిపై దాడి చేసిన ఘటనలో కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ విఠల్‌ ఆదివారం తెలిపారు. గ్రామానికి చెందిన దార అనిల్‌ ప్రైవేట్‌ వాటర్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన వాటర్‌ ట్యాంకర్‌ డ్రైవర్‌గా పనిచేసిన ఏర్పుల బబ్లూ తనకు రావాల్సిన రూ.3 వేలు ఇవ్వమని అనిల్‌ను అడగ్గా, త్వరలో ఇస్తానని చెప్పాడు. దీంతో అనిల్‌ తలపై కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. బాధితుడు అనిల్‌ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎంఎస్‌ఎన్‌ పరిశ్రమలో ప్రమాదం

ఇద్దరు కార్మికులకు తీవ్ర గాయాలు


పటాన్‌చెరు టౌన్‌: ఎంఎస్‌ఎన్‌ పరిశ్రమలో రియాక్టర్‌ వద్ద పనిచేస్తున్న ఇద్దరు కార్మికులకు గాయాలైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు మండల పరిధిలోని రుద్రారం గ్రామ సమీపంలోని ఎంఎస్‌ఎన్‌ పరిశ్రమలో శనివారం రాత్రి ఒంటి గంట సమయంలో రియాక్టర్‌లో మెటీరియల్‌ వేస్తుండగా అక్కడే కార్మికులుగా పనిచేస్తున్న మధ్యప్రదేశ్‌కు చెందిన రాజు కోలీ, శివ మంగిలేష్‌ సింగ్‌కు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే చికిత్స నిమిత్తం కంచన్‌బాగ్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి


నాగేశ్‌గౌడ్‌ (ఫైల్‌)

కౌడిపల్లి(నర్సాపూర్‌): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆదివారం ఏఎస్‌ఐ విఠల్‌ తెలిపిన వివరాల ప్రకారం.. కౌడిపల్లి గ్రామానికి చెందిన హనుమగౌనోల్ల నాగేష్‌గౌడ్‌(58) శుక్రవారం రాత్రి గాయపడగ్గా చికిత్స నిమిత్తం నిమ్స్‌కు తరలించిన విషయం తెలిసిందే. శనివారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మలిసంధ్యలో మనోవేదన



సాక్షి, సిద్దిపేట: కొందరు వృద్ధుల ఆఖరి మజిలీ భారంగా.. బాధగా గడుస్తోంది. అనారోగ్యం ఓవైపు బాధిస్తుంటే బాధ్యతగా చూడాల్సిన కుటుంబ సభ్యులు, కడుపున పుట్టిన పిల్లల ఆప్యాయతలు, అనురాగాలకు దూరమై మనోవేదనకు గురవుతున్నారు. ఇక సెలవంటూ పండుటాకులు ఈ లోకాన్ని వీడుతున్నారు. జీవితంపై విరక్తితో బలవన్మరణాలకు పాల్పడుతున్నారు.

అన్నీ కన్నీటి గాథలే..

మలిసంధ్యలో ఆత్మహత్యలు చేసుకుంటున్నవారివి అన్నీ కన్నీటి గాథలే. పిల్లల భవిష్యత్‌ కోసం ఎంతో శ్రమించిన తల్లిదండ్రులకు కొందరు నిలువనీడ లేకుండా చేస్తున్నారు. సేవచేయడానికి ముక్కువిరుస్తున్నారు. బుక్కెడు అన్నం పెట్టడానికి మొహం చాటేస్తున్నారు. కొడుకులకు పెళ్లీలుచేసి వారిని ఓ ఇంటి వారిని చేసిన తర్వాత కొన్నాళ్లకు గొడవలు ప్రారంభమవుతున్నాయి. ఆస్తిపంపకాల తర్వాత ఆత్మీయ పలకరింపులు కరువవుతున్నాయి. ఆస్తి గొడవలు, పిల్లలతో గొడవలు, అనారోగ్యం, ఒంటరితనం ఇవన్నీ ప్రధాన కారణాలే. వీటి నుంచి బయటపడలేక వృద్ధులు ప్రాణాలు తీసుకుంటున్నారు.

బాగోగులు చూడకపోవడంతో ఫిర్యాదులు

తల్లిదండ్రుల బాగోగులు పిల్లలు చూడకపోవడంతో ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. కొందరు స్థానికంగా పంచాయితీ పెట్టి నిర్ణయిస్తున్నారు. మరి కొందరు మెయింటనెన్స్‌ వెల్ఫేర్‌ సీనియర్‌ పేరెంట్స్‌ అండ్‌ సిటిజన్స్‌ చట్ట ప్రకారం ఆర్‌డీఓలకు ఫిర్యాదులు చేస్తున్నారు. దీంతో ఆ కేసులను పరిశీలించి తల్లిదండ్రుల మెయింటనెన్స్‌ కోసం డబ్బులు ఇవ్వాలని తీర్పునిస్తున్నారు. కొందరేమో ఇస్తుండగా మరికొందరు ఇవ్వకుండా జిల్లా కలెక్టర్‌కు అప్పీల్‌ చేసుకుంటున్నారు. ఇలా సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా 86 ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో కేవలం 36 ఫిర్యాదులకే పరిష్కారం లభించింది.

ఇదీ పరిస్థితి..

- జిల్లాలోని హుస్నాబాద్‌ మండలం పొట్లపల్లి గ్రామానికి చెందిన మెడబోయిన వెంకటయ్య(90)కు నలుగురు కుమారులు. ఒక కుమార్తె ఉన్నారు. ఈయన భార్య చాలా యేళ్ల క్రితమే చనిపోయింది. వంతులవారీగా పోషిస్తు తన కుమారులకు భారం కావద్దని, సొంత ఊరిని వదిలి వెళ్లడం ఇష్టం లేకనో ఎవరికి చెప్పకుండా బయటకు వచ్చాడు. పెద్ద కొడుకు కనకయ్య నెలరోజుల వంతు పూర్తి కావడంతో ఈనెల 2వ తేదీన రెండో కుమారుడి దగ్గరకు వెళ్లాల్సి ఉంది. అటు వెళ్లలేక ఈనెల 4వ తేదీన పొట్లపల్లి గ్రామం ఎల్లమ్మ గుడి వద్ద ఆత్మహత్య చేసుకొని తనువు చాలించాడు.
- తొగుట మండలం వేముఘట్‌లో తూటుకూరి మల్లారెడ్డి(70) మల్లన్నసాగర్‌లో భూమి కోల్పోయాడు. 60 ఏళ్లు దాటడంతో ప్రభుత్వం ఆర్‌అండ్‌ఆర్‌ ప్యాకేజీ కింద కింద ఇల్లు కేటాయించలేదు. సొంత ఊరిని వదలలేక మనస్తాపానికి గురైన ఆయన కూలిన ఇంట్లోనే 2021 జూన్‌ 18న చితిని పేర్చుకుని ఆత్మహుతి చేసుకున్నాడు. ఈయన భార్య అమృతమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. ముగ్గురు కూతుళ్లు, అందరికీ పెళ్లిళ్లు చేశారు.
- చిన్నకోడూరు మండలం మెట్టుపల్లి గ్రామానికి చెందిన వృద్ధుడు(65)కి ఇద్దరు కొడుకులు. ఒకరు హైదరాబాద్‌లో ప్రైవేట్‌ జాబ్‌ చేస్తుండగా, మరో కొడుకు విదేశాల్లో ఉద్యోగం చేస్తున్నాడు. సదరు వృద్ధుడు తన ఇద్దరు కొడుకులు పట్టించుకోవడం లేదని సిద్దిపేట ఆర్‌డీఓకు ఫిర్యాదు చేశాడు. నిర్వహణ కోసం తండ్రికి రూ.20 వేలు ప్రతీనెల ఇవ్వాలని ఆర్‌డీఓ అనంతరెడ్డి ఆదేశించారు. అంత డబ్బులు ఇవ్వలేను అని హైదరాబాద్‌లో ఉండే కొడుకు కలెక్టర్‌కు అప్పీల్‌ పెట్టుకున్నాడు. జిల్లా అదనపు కలెక్టర్‌ శ్రీనివాస్‌ రెడ్డి ఇద్దరి వాదనలు విన్నాడు. కేసును ఈనెల 27కు వాయిదా వేశారు.
- దుబ్బాక పట్టణంలోని వృద్ధదంపతులు (85 నుంచి 80 సంవత్సరాల మధ్య ఉంటారు) వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు ప్రభుత్వ ఉద్యోగిగా విధులు నిర్వర్తించేవారు. తను మృతిచెందడంతో కోడలుకు ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చారు. ఈ దంపతులను కోడలు సాదకపోవడంతో సిద్దిపేట ఆర్‌డీఓకు ఫిర్యాదు చేశారు. దీంతో కోడలు, కుమార్తె ఒక్కొక్కరు రూ. 5 వేల చొప్పున నెలకు రూ.10 వేలు ఇవ్వాలని ఆర్‌డీఓ అదేశించారు. కోడలు ఇచ్చే పరిస్థితిలో లేను అని కలెక్టర్‌కు అప్పీల్‌ చేశారు. జిల్లా అదనపు కలెక్టర్‌ శ్రీనివాస్‌ రెడ్డి ఇద్దరి వాదనలు విన్నారు. కేసు ఈ నెల 27కు వాయిదా వేశారు.

వృద్ధులను గౌరవించాలి...



వృద్ధులను గౌరవిస్తూ ప్రేమ, ఆప్యాయతతో మాట్లాడాలి. ఎవరికైనా మానసిక పరిస్థితి సరిగా లేకవడం, ఇతర ఆర్థిక, కుటుంబ సమస్యలు, ఇతర కారణాలతో చనిపోవాలి అనే ఆలోచన వచ్చిన వారిని గుర్తించి వెంటనే మానసిక వైద్య నిపుణుడి దగ్గరకు తీసుకెళ్లాలి. ఆరోగ్య పరిస్థితి నిబట్టి చికిత్స అందించడంతో పాటు అవగాహన కల్పించి వారిని సేవ్‌ చేయవచ్చు. సైకలాజికల్‌, సోషల్‌ కారణాలను ముందుగా గుర్తించి వారికి అవగాహన కల్పించి ఆత్మహత్య చేసుకోకుండా కాపాడవచ్చు.

– డాక్టర్‌ సి.శాంతి, సైకియాట్రీ విభాగ హెచ్‌ఓడీ, సిద్దిపేట ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రి


ప్రమాదానికి కారణమైన కారు

దూసుకొచ్చిన మృత్యువు

- పండ్ల వ్యాపారులను ఢీకొన్న కారు
- ఒకరి మృతి.. నలుగురికి గాయాలు

రామాయంపేట(మెదక్‌): రామాయంపేటలో పండ్ల వ్యాపారులకు పైకి ఓ కారు దూసుకెళ్లింది. ఈ సంఘటనలో ఒక మహిళ మృతి చెందగా, మరో నలుగురు గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం..పట్టణంలో ఆదివారం కారును డ్రైవర్‌ అతివేగంగా నడపడంతో..అదుపు తప్పి రోడ్డుపక్కనే పండ్లు అమ్ముకుంటున్న వ్యాపారులపైకి దూసుకెళ్లింది. దీంతో రోడ్డు పక్కనే మామిడిపండ్లు విక్రయిస్తున్న మండలంలోని ప్రగతి ధర్మారం గ్రామానికి చెందిన రేణుక (55) అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ప్రమాదంలో రామాయంపేటకు చెందిన జలగడుగుల సత్యనారాయణతో పాటు కామారెడ్డి జిల్లా బాగిర్తిపల్లికి చెందిన గంగమణి, రింకు విశ్వకర్మ, మరొకరు గాయపడ్డారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


రేణుక మృతదేహం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గంగమణి


గాయపడిన రింకు విశ్వకర్మ

ఒకరి మృతి... ఐదుగురికి గాయాలు

ఉమ్మడి జిల్లాలో వేర్వేరు చోట్ల ప్రమాదాలు

బైక్‌, పెళ్లి బస్సు ఢీ


క్షతగాత్రుడు కిషన్‌

టేక్మాల్‌(మెదక్‌): ఎదురెదురుగా ప్రైవేటు పెళ్లి బస్సు, బైక్‌ ఢీ కొనడంతో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్‌ఐ రమేశ్‌ తెలిపిన వివరాల ప్రకారం..మండల పరిధిలోని బొడ్మట్‌పల్లి గ్రామానికి చెందిన కొడపాక కిషన్‌ బైక్‌పై ఆదివారం టేక్మాల్‌ నుంచి బొడ్మట్‌పల్లికి వస్తున్నాడు. ఇదే క్రమంలో మెదక్‌ వెళుతున్న ప్రైవేటు పెళ్లి బస్సు, బైక్‌ కాద్లూర్‌ శివారులో ఎదురెదురుగా ఢీ కొన్నాయి. దీంతో బైక్‌పై ఉన్న కిషన్‌ కంటికి తీవ్ర గాయమైంది. స్థానికులు 108 వాహనంలో జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు మెరుగైన చికిత్స కోసం నిమ్స్‌కు తీసుకెళ్లాలని సూచించారు. ఎస్‌ఐ రమేశ్‌ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. పెళ్లిబస్సును పోలీసులు స్టేషన్‌కు తరలించారు. బాధితుడి తల్లి పెంటమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు...

సిద్దిపేటకమాన్‌: రోడ్డు ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న దంపతులు గాయపడిన ఘటన సిద్దిపేట పట్టణంలో చోటుచేసుకుంది. టూటౌన్‌ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట న్యూ కేసీఆర్‌ నగర్‌కు చెందిన యాసరాల వేణు–వెన్నెల దంపతులు కిరాణసామగ్రి కొనుగోలు చేసేందుకు బైక్‌పై సిద్దిపేటకు వెళుతుండగా నర్సాపూర్‌ చౌరస్తా కుంకుమ మిల్లు వద్ద బొలెరో వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలు కాగా, సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వేణు తలకు తీవ్ర గాయం కావడంతో వైద్యులు నిమ్స్‌ ఆస్పత్రికి రెఫర్‌ చేశారు. వెన్నెల సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు బొలేరో వాహన డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు

సంగారెడ్డి మున్సిపాలిటీ: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం చౌటకూరు మండలం శివంపేట శివారులో చోటుచేసుకుంది. పుల్కల్‌ ఎస్‌ఐ విజయ్‌కుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన లకంసాని వీరిన్‌మానస్‌(22) బైక్‌పై ఆదివారం సింగూరు రిజర్వాయర్‌ చూసేందుకు వెళుతుండగా, శివంపేట శివారులోని రోడ్డు టర్నింగ్‌ వద్ద వీరిన్‌మానస్‌ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న సైడ్‌ రెయిలింగ్‌ను ఢీకొన్నాడు. దీంతో వీరిన్‌మానస్‌ బైక్‌పై నుంచి కిందపడటంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. వీరిన్‌మానిస్‌ తండ్రి కాశీ విశ్వేశ్వర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

కారును ఢీ కొట్టిన బస్సు

మనోహరాబాద్‌(తూప్రాన్‌): కారును ఢీ ఎక్స్‌ప్రెస్‌ బస్సు ఢీ కొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మనోహరాబాద్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ఆదివారం జరిగింది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన బ్రహ్మం కారులో తన కూతురు శ్రీజను కొంపల్లిలో హాస్టల్‌ దించి మిత్రుడు దామోదర్‌తో కలిసి తిరిగి ప్రయాణమయ్యాడు. కాగా హైదరాబాద్‌ నుంచి కామారెడ్డి వెళుతుండగా, అదే సమయంలో వెనుక వస్తున్న మెదక్‌ ఎక్స్‌ప్రెస్‌ మనోహరాబాద్‌ మండలం కాళ్ళకల్‌ గ్రామ శివారు జాతీయ రహదారిపై ఢీ కొట్టింది. దీంతో కారులో ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. కారు ధ్వంసమైందని బాధితులు తెలిపారు. బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.


కాళ్ళకల్‌ వద్ద కారును ఢీ కొట్టిన ఎక్స్‌ప్రెస్‌ బస్సు

కేసీఆర్‌ హయాంలో ఆలయ అభివృద్ధి

ఆలయ చైర్మన్‌ గీస భిక్షపతి

కొమురవెల్లి(సిద్దిపేట): సీఎం కేసీఆర్‌ పాలనలో కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయం అభివృద్ధి చెందిందని ఆలయ చైర్మన్‌ గీస భిక్షపతి అన్నారు. ఆదివారం ఆలయ ఇన్‌చార్జ్‌ ఈఓ రామాంజనేయులుతో కలసి 2022–23 ఏడాదికి సంబంధించిన ఆలయ ఆదాయ,ఖర్చుల వివరాలను వెల్లడించారు. ఆలయానికి భక్తుల రద్దీ పెరగడంతో గ్రాస్‌ ఆదాయం రూ.18,12,31,193 వచ్చిందన్నారు. 14.978 కిలోల బంగారం, 1009 కిలోల 280 గ్రాముల వెండి వస్తువులు సమకూరినట్లు తెలిపారు. ఆలయంలో 36 రకాల అభివృద్ధి పనులు చేపట్టి, 27 పనులను పూర్తి చేశామని, మరో 9 రకాల పనులు కొనసాగుతున్నాయన్నారు. రూ.12 కోట్లతో క్యూ కాంప్లెక్స్‌ పనులను ఈ నెల 25న ప్రారంభించనున్నట్లు తెలిపారు. భక్తులు బస చేసేందుకు రూ.12 కోట్లతో 62 గదుల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్‌, ధర్మకర్తలు నర్ర రఘువీరారెడ్డి, కాసర్ల కనుకరాజు, పచ్చిమడ్ల సిద్ధిలింగం, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.


ఆదాయ వ్యయాలను చూపుతున్న చైర్మన్‌ గీస భిక్షపతి, ఈఓ రామాంజనేయులు

భూ బాధితుల అరెస్ట్‌


పోలీసుల అదుపులో భూ బాధితులు

కొండపాక(గజ్వేల్‌): మండలంలోని దుద్దెడ కలెక్టరేట్‌ సమీకృత భవన నిర్మాణంలో భూములు కోల్పోయిన బాధితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తమ భూములకు ప్రభుత్వం నుంచి పరిహారం అందించాలని కోరారు. ఆదివారం పశు వైద్య కళాశాల భవన నిర్మాణానికి శంకుస్థాపనకు వచ్చిన మంత్రి హరీశ్‌రావును కలిసేందుకు ప్రయత్నించారు. సమాచారం తెలుసుకున్న త్రీ టౌన్‌ పోలీసులు ముందస్తుగా భూబాధితులు కొమ్ము మల్లికార్జున్‌, పిల్లి అశ్వద్ధామ, కరుణాకర్‌ను అదుపులోకి తీసుకొని అనంతరం సర్పంచ్‌ ఆరేపల్లి మహదేవ్‌ గౌడ్‌ పూచీకత్తుపై వదిలిపెట్టారు.

గుండంలో యువకుడి గల్లంతు


చంద్రయ్య కోసం అమృత గుండంలో గాలింపు చర్యలు

కోహీర్‌(జహీరాబాద్‌): ఈతకు వెళ్లి గుండంలో మునిగి ఓ యువకుడు గల్లంతయ్యాడు. ఎస్‌ఐ సురేష్‌ కథనం ప్రకారం...మండల పరిధిలోని బిలాల్‌పూర్‌ గ్రామానికి చెందిన చంద్రయ్య అలియాస్‌ చింటు ఆదివారం మధ్యాహ్నం జరిగే పెళ్లి వేడుకల్లో పాల్గొనడానికి స్నేహితులతో కలిసి బడంపేట శ్రీ రాచన్నస్వామి ఆలయానికి వెళ్లాడు. స్నేహితులతో కలిసి సరదాగా ఈతకు దిగి అమృతగుండంలో మునిగిపోయాడు. తోటి స్నేహితులు ఎంత వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. గుండంలో నీరు ఎక్కువగా ఉండడంతో గజఈతగాళ్లు ప్రయత్నించినా ఆచూకీ లభించలేదు. మోటారుతో గుండంలో నీరు ఖాళీ చేసే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నారు. రాత్రి 8 గంటల ప్రాంతంలో జహీరాబాద్‌ నుంచి అధిక హార్స్‌ పవర్‌ గల నాలుగు మోటర్లను తెప్పించి నీటిని తోడుతున్నారు. ఫ్లడ్‌లైట్ల సహాయంతో గాలింపు కొనసాగుతుందని ఎస్‌ఐ సురేష్‌ తెలిపారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

చేగుంట(తూప్రాన్‌): చేపలవేటకు వెళ్లిన వ్యక్తి నీటిలో మునిగి మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన మాసాయిపేటలో ఆదివారం వెలుగు చూసింది. ఎస్‌ఐ ప్రకాశ్‌గౌడ్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని వడ్డెరవాడకు చెందిన పల్లపు మహేశ్‌(45) గ్రామ సమీపంలోని కంకర మిషన్‌ వద్ద నీటిమడుగులో శనివారం చేపలు పట్టడానికి వెళ్లి తిరిగిరాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు ఆదివారం నీటి మడుగు పరిసర ప్రాంతాల్లో గాలించగా మహేశ్‌ మృతదేహం నీటిపై తేలుతూ కనపించింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా వారు సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.


మహేశ్‌ మృతదేహం

గర్భిణిని నిర్లక్ష్యం చేశారంటూ..

- ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన
- చర్యలు తీసుకోవాలని డిమాండ్‌

తూప్రాన్‌: ప్రసవం కోసం వచ్చిన గర్భిణిని తూప్రాన్‌ ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యం చేశారని ఆరోపిస్తూ బంధువులు ఆస్పత్రి ఎదుట నిరసనకు దిగారు. మండల పరిధిలోని యావపూర్‌ గ్రామానికి చెందిన పిట్ల వనజ రెండో కాన్పు కోసం తూప్రాన్‌ సీహెచ్‌సీ (కమ్యూనిటీ హెల్త్‌ సెంటర్‌)కు శనివారం రాత్రి వచ్చింది. అయితే వైద్య పరీక్షల ప్రకారం మరో 15 రోజుల గడువు ఉంది. పురిటి నొప్పులు రాడవంతో ఆస్పత్రికి తీసుకొచ్చినట్లు వైద్య సిబ్బందికి తెలిపినా వారు పట్టించుకోలేదని కుటుంబ సభ్యులు ఆరోపించారు. కొద్దిసేపటికే నొప్పులు వచ్చి మగశిశువుకు జన్మనిచ్చిందన్నారు. అప్పటి వరకు సెల్‌ఫోన్‌లో కాలక్షేపం చేస్తున్న సిబ్బంది శిశువుకు వైద్యసేవలు చేసిన అనంతరం శిశువు ఉమ్మనీరు మింగిందని, వెంటనే చిన్న పిల్లల ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మేడ్చల్‌ జిల్లాలోని కొంపల్లిలోని ప్రైవేట్‌ ఆస్పత్రికి శిశువును తీసుకెళ్లినట్లు చెప్పారు. కాగా ప్రసవించిన వనజ ప్రస్తుతం తూప్రాన్‌లో ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారన్నారు. వైద్యం కోసం వచ్చిన వారిపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైద్యులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.


తూప్రాన్‌ ప్రభుత్వ ఆస్పతిలో చికిత్స పొందుతున్న పిట్ల వనజ

ఆరోపణలు అవాస్తవం

ఆస్పత్రికి ప్రసవం కోసం వచ్చిన గర్భిణి వనజ పట్ల మా సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారనం అవాస్తవం. పురిటి నొప్పులు రావడంతో ఆస్పత్రిలోని బెడ్‌పైకి సిబ్బంది తీసుకెళ్లారు. ప్రసవ సమయంలో విద్యుత్‌ సరఫరా నిలిచిపోయినా సిబ్బంది సమయస్ఫూర్తితో ప్రసవం చేశారు. శిశువు ఛాతీలో ఉమ్మనీరు చేరడం గుర్తించి తొలగించామన్నారు. మెరుగైన చికిత్స కోసం నీలోఫర్‌కు తీసుకెళ్లాలని సూచించారు. గర్భిణి బంధువులు చేసే ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదు. – అమర్‌సింగ్‌, ఆస్పత్రి సూపరింటెండెంట్‌